ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కుత్బుల్లాపూర్: ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని, ప్లాస్టిక్‌ను వాడొద్దని నినదిస్తూ పేట్‌బషీరాబాద్‌లోని సెయింట్ ఆన్స్ హై స్కూల్ విద్యార్థులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. పలు ప్రాంతాల్లోని స్థానిక సంక్షేమ నేతలతో కలిసి ప్లకార్డులను ప్రదర్శించారు. ఎన్‌సీసీ విద్యార్థులు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనార్థాలతో పాటు భవిష్యత్ తరాలకు కలిగే ముప్పును వివరించారు.

విద్యార్థులకు పరీక్ష కిట్ల పంపిణీ



జగద్గిరిగుట్ట: హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు పరీక్ష కిట్లు అందజేశారు. సంఘ సేవకులు స్వర్గీయ డాక్టర్ భూషణ్ రావు జయంతి సందర్భగా వారి కుటుంబ సభ్యుల సహకారంతో నెహ్రూ నగర్ ప్రభుత్వ పాఠశాలలో ఎంఈఓ జెమిని కుమారి చేతుల మీదుగా ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ అధ్యక్షులు విజయ్ కుమార్, రమేష్, సామాజిక వేత్త మధుబాబు చికిలే, కోశాధికారి మైసా దేవి, సభ్యులు సాజిత్, ఉపాధ్యాయులు తిరుపతి, శ్రీశైలం, రాజామణి, నాగమణి, జ్యోతి, జగదీష్ విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి వీల్‌చైర్ అందజేత



సుభాష్‌నగర్: సూరారం విశ్వకర్మ కాలనీలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బిజ్జిలి లత, కాలనీ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డిల ఆధ్వర్యంలో దివ్యాంగుడికి వీల్‌చైర్‌ను బహూకరించారు. కార్యక్రమంలో కాలనీ సెక్రటరీ సదానందం, మల్లేష్, మహిళలు లక్ష్మి, మానస, సరిత, నిర్మల, సామ్రాజ్యం, సుధ తదితరులు పాల్గొన్నారు.

భవనంపై నుంచి పడి కార్మికుడి మృతి

కుత్బుల్లాపూర్: నిర్మాణంలో ఉన్న భవనంలో పని చేస్తు రెండవ అంతస్తు నుంచి కిందపడి ఓ కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన భవన్ రజాక్(40) కొంపల్లిలోని అమృత ప్రాజెక్ట్స్‌లో మేస్త్రీగా పని చేస్తున్నాడు. ఈ నెల 11వ తేదీన ఉదయం 9 గంటలకు నిర్మాణంలో ఉన్న రెండవ అంతస్తులో పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. వెంటనే తోటి కార్మికులు సమీపంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. యాజమాన్యం నిర్లక్ష్యంగానే తన భర్త మృతి చెందాడని మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీ కొన్న ఘటనలో డెలివరీ బాయ్ మృతి

దుండిగల్: వెనుక నుంచి వచ్చిన లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో డెలివరీ బాయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రం మైరాహా టోలక్ జిల్లా నిగిరి గ్రామానికి చెందిన మింటూ జైస్వాల్(22) నగరానికి వలస వచ్చాడు. మల్లంపేటలోని బీసీ కాలనీలో వరుసకు సోదరుడైన రమేష్ కుమార్‌తో కలిసి అద్దెకు ఉంటూ డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. బుధవారం తెల్లవారుజామున 12.30 గంటల సమయంలో మింటూ జైస్వాల్ తన యాక్టీవాపై మల్లంపేట నుంచి కేవీఆర్ వ్యాలీ వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో పోచమ్మ ఆలయం సమీపంలో వెనుక నుంచి వచ్చిన లారీ ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడిన జైస్వాల్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు రమేష్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీటి కష్టాలు షురూ!



ఫిల్లింగ్ స్టేషన్ వద్ద ట్యాంకర్లు

అసలే వేసవికాలం. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటుతుండటంతో నీటి కష్టాలు మొదలయ్యాయి. ఇళ్లలో, అపార్ట్‌మెంట్‌లల్లో ఉన్న బోర్లు ఎండిపోవడం మొదలైంది. ఇక జలమండలి నుంచి వస్తున్న నీరు సైతం సక్రమంగా రావడం లేదు. వచ్చినా లో ప్రెషర్‌తో వస్తుండటంతో నీటి సమస్య తీవ్రమవుతుంది. ఇక తప్పని పరిస్థితిలో ప్రజలు ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు. జలమండలి ట్యాంకర్‌లకు ఫుల్ డిమాండ్ ఉండటంతో అందుబాటులో లేక ప్రైవేట్ ట్యాంకర్లపై కూడా ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది.

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- నీళ్లు లేక తల్లడిల్లుతున్న జనం
- జలమండలి ట్యాంకర్‌లకు పెరిగిన డిమాండ్
- సరఫరా చేయడంలో అధికారులు విఫలం

నిజాంపేట్: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సుమారు మూడు లక్షల వరకు జనాభా నివాసం ఉంటున్నారు. ఇక్కడ ప్రజలకు ముఖ్యంగా బస్తీలు, మురికి వాడలు, ఇందిరమ్మ కాలనీలు, రాజీవ్ గృహకల్పల్లో ప్రధాన నీటి వనరు జలమండలి సరఫరా చేసే నీరే. ఇక అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీ కాలనీల్లో అయితే జలమండలి నీరుతో పాటు బోర్లు సైతం అందుబాటులో ఉన్నాయి. నీరు సరిపడా రాక ప్రజలు తల్లడిల్లుతున్నారు.

రోజు విడిచి రోజు సరఫరాకు కృషి

ప్రతి రోజు పై నుంచి రావాల్సిన సరిపడా నీరు రాక పోవడంతో మూడు, నాలుగు రోజులుగా ఇబ్బంది అయ్యింది. దీంతోనే సమస్య ఎక్కువైంది. సాధ్యమైనంత వరకు రోజు విడిచి రోజు నీరు అందించేందుకు ప్రయత్నం చేస్తున్నాం. ట్యాంకర్ బుక్ చేసుకున్న వారికి 24 గంటల్లో పంపిస్తున్నాం. నీటి సరఫరాలో ఇంకా ఏమైన ఇబ్బందులు ఉంటే తమను సంప్రదిస్తే సమస్యను పరిష్కారం చేస్తాం. - చంద్రమోహన్, డీజీఎం నిజాంపేట్

అడుగంటిన బోర్లు

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధితో పాటు చుట్టు పక్కల సైతం సుమారు 12 వందల అడుగుల నుంచి 15 వందల అడుగుల లోతు వరకు బోర్లు వేస్తేనే నీరు వస్తుంది. బోర్లపై ఎలాంటి నియంత్రణ లేదు. దీనికి తోడు వేసవి కావడంతో మార్చి నెల ప్రారంభంతోనే తక్కువ లోతు ఉన్న బోర్లు అడుగంటి పోయాయి. రోజు రోజుకు భూగర్భ జలాలు వేగంగా తగ్గిపోతుండటంతో రాబోయే రెండు, మూడు నెలలు నీటి కోసం ఎన్ని ఇబ్బందులు వస్తాయో? అని కాలనీల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అస్తవ్యస్తంగా నీటి సరఫరా

బస్తీలు, మురికివాడ ప్రాంతాలను కాకుండా కాలనీల్లో, అపార్ట్‌మెంట్లకు నీటి సరఫరాను రోజు విడిచి రోజు చేయాల్సి ఉంటుంది. అధికారులు మాత్రం అందుకు భిన్నంగా నాలుగైదు రోజులు, ఒక్కో సారి వారం రోజుల వరకు సైతం నీటి సరఫరా చేయడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వదిలినా లో ప్రెషర్‌తో రావడంతో సరిపడా నీరు అందడం లేదంటున్నారు. రోజు విడిచి రోజు నీరు సరఫరా అయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ట్యాంకర్లకు డిమాండ్

నీటి కొరతతో క్యాన్ నెంబర్ కల్గిన చాలా మంది జలమండలి ట్యాంకర్లపై ఆధారపడుతున్నారు. నిజాంపేట్, బాచుపల్లి, ప్రగతినగర్ ప్రాంతాల్లో ఉన్న ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్ల నుంచి ట్యాంకర్ పెద్ద సంఖ్యలో ట్యాంకర్ బుక్ చేసుకుంటున్నారు. ప్రతి రోజు ఈ మూడు ఫిల్లింగ్ స్టేషన్ల నుంచి సమారు 300 ట్యాంకులు బుక్ అవుతున్నాయి. అయితే ప్రజల డిమాండ్‌కు తగినట్లు నీటి సరఫరా చేయడంలో మాత్రం అధికారులు పూర్తిగా విఫలమయ్యారని స్థానికులు వాపోతున్నారు. నిబంధనల మేరకు ట్యాంకర్ బుక్ చేసిన 24 గంటల్లో అధికారులు సరఫరా చేయాలి. కానీ ట్యాంకర్ బుక్ చేసిన మూడు రోజుల వరకు కూడా ట్యాంకర్‌లు రావడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం నీళ్ల గురించి అధికారులను అడుగుదామంటే ఫోన్ కూడా ఎత్తడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు ప్రాంతాల్లో ఉన్న ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్లల్లో కేవలం 53 ట్యాంకర్‌లు ఉండటంతో సకాలంలో డిమాండ్‌కు తగ్గ సప్లయ్ చేయడం లేదనే విమర్శలున్నాయి. డొమెస్టిక్ కన్న కమర్షియల్ ట్యాంకర్ల సప్లయ్‌కే అధికారులు ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. జలమండలి ట్యాంకర్ల ద్వారా నీటిని సకాలంలో అందించకపోవడంతో అపార్ట్‌మెంట్ వాసులు, కాలనీల ప్రజలు నీటి కోసం ప్రైవేటు ట్యాంకర్‌లపై ఆధారపడాల్సి వస్తుంది. ప్రైవేటు ట్యాంకర్‌లు పది వేల లీటర్ల ట్యాంకర్‌కు సుమారు రూ.1500 నుంచి రూ. 2 వేల వరకు వసూలు చేస్తున్నారు. జలమండలి ట్యాంకర్ అయితే ఐదు వేల లీటర్ల ట్యాంకర్‌కు కేవలం రూ. 500 మాత్రమే కావడంతో ప్రజలు జలమండలి ట్యాంకర్‌లకు ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తున్నారు. డిమాండ్‌ను బట్టి ప్రైవేట్ ట్యాంకర్లు ధరను కూడా పెంచుతున్నారు.

ఐదు రోజులకు ఒక సారి నీళ్లు



మంజీరా నీళ్లు రోజు విడిచి రోజు రావడం లేదు. ఐదు రోజులకు ఒకసారి వస్తున్నాయి. వచ్చినా లో ప్రెషర్‌లో వస్తున్నాయి. దీంతో నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. బిల్లులు మాత్రం సకాలంలో చెల్లించాలని ఒత్తిడి తెస్తారు. నీటిని సరఫరా చేయడంలో మాత్రం వాటర్ వర్క్స్ అధికారులు శ్రద్ధ చూపడం లేదు. కమర్షియల్‌గా అమ్ముకోవడంపై అధికారులు ఎక్కువగా దృష్టి పెడుతున్నారు. వేసవి కాలంలో కమర్షియల్ ట్యాంకర్‌లను తగ్గిస్తే బాగుంటుంది. - అచ్యుతరెడ్డి, ప్రగతినగర్

సమయానికి నీళ్లు అందించాలి



అసలే వేసవికాలం. దీనికి తోడు నీళ్లు రాకపోతే మా పరిస్థితి ఎట్లా. అధికారులు కాలనీలకు సమయానికి నీళ్లు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. నీళ్ల కోసం ప్రతి సారి కార్యాలయాల చుట్టూ తిరగాలంటే ఇబ్బందిగా ఉంటుంది. అధికారులే ఎక్కడెక్కడ నీటి సమస్య ఉందో గుర్తించి దానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలి. - కృష్ణ, సాయినగర్

సమస్యలను పరిష్కరించాలి

కుత్బుల్లాపూర్: ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను అధికారులు పరిష్కరించాలని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి అన్నారు. జీడిమెట్ల డివిజన్ పరిధి లక్ష్మి గంగా ఎన్‌క్లేవ్‌లో కాలనీ వాసులు డ్రైనేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని ఆయన దృష్టికి రావడంతో బుధవారం కాలనీలో పర్యటించారు. స్థానికుల ద్వారా వివిధ సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, కె.హరిదాస్, కె.సతీష్, కె.కృష్ణ, కె.శ్రీనివాస్, రమణారెడ్డి, వేణుగోపాల్, ఏ.వి.ఎస్ రెడ్డి, ఉస్సేన్, వెంకట్, రోసెన్, రాయుడు, రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ పునఃప్రతిష్ఠ పూజలు



హోమం చేస్తున్న పూజారులు

సుభాష్‌నగర్: సూరారం లక్ష్మీనగర్‌లోని ఆంజనేయ స్వామి విగ్రహ పున ప్రతిష్ఠాపన వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ నెల 9వ తేదిన ప్రారంభమైన ఉత్సవాలు 14 వరకు కొనసాగనున్నాయి. బుధవారం నిత్య పూజలు, నిత్య హోమాలు, ఆదివాసాలు, గంగాజలం, సముద్ర జలం, మహా కుంభమేళ జలం నీటితో జలవాసం, వాస్తు హోమం, జలాదివాసం నిర్వహించారు. గురువారం నిత్య పూజ హోమం, ధ్యానాదివాసం, రాత్రికి నిత్య పూజ హోమం, ఫలాదివాసం, మధురా దివాసం, 14న నిత్య పూజ, నిత్య హోమం, విగ్రహ పున ప్రతిష్ఠాపన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

పన్నులు చెల్లించకుంటే రెడ్ నోటీస్!

ఆపై నిర్లక్ష్యం వహిస్తే సీజ్



దుకాణం సీజ్ చేసేందుకు వెళ్లగా రూ. 5 లక్షల పన్ను చెల్లించిన యజమాని

కుత్బుల్లాపూర్ : జంట సర్కిళ్ల పరిధిలో పన్నుల వసూళ్ల ప్రక్రియలో వేగం పెంచారు. ప్రతిరోజు టార్గెట్ పెట్టుకొని రెవెన్యూ, బిల్ కలెక్టర్లు ఆయా వ్యాపార, వాణిజ్య, గృహ సముదాయాల వద్దకు వెళ్లి మొండి బకాయి వసూలు చేస్తున్నారు. కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల పరిధిలో ఇప్పటికే రెడ్ నోటీసులు జారీ చేసి మొండి బకాయిదారులపై దూకుడు పెంచారు. డబ్బులు చెల్లించకుంటే అక్కడికక్కడే సీజ్ చేస్తున్నారు.

టార్గెట్‌కు మించి వసూళ్లకు ప్లాన్..

జంట సర్కిళ్ల ఉప కమిషనర్లు నరసింహ, మల్లారెడ్డి తమదైన పన్నుల వసూలుకు ప్రణాళికలు రూపొందించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో తమకు కేటాయించిన టార్గెట్ తో పాటు ఇటీవల 90 శాతం వడ్డీ మాఫీ ద్వారా మరింత పన్నులు వసూలు అవకాశాలు ఉన్నాయని పేర్కొంటున్నారు. కుత్బుల్లాపూర్ లో రూ.54 కోట్లకు గాను ఇప్పటి వరకు రూ.47 కోట్లు వసూలు చేశారు. గాజులరామారం సర్కిల్‌లో రూ.35 కోట్లకుగాను రూ.31 కోట్లు వసూలయ్యాయి. మరో 15 రోజులు గడువు ఉండటంతో ప్రతిరోజు టార్గెట్ విధించి బిల్ కలెక్టర్లను అప్రమత్తం చేస్తున్నారు. గ్రేటర్ అధికారులు విధించిన టార్గెట్ కంటే ఎక్కువ మొత్తంలో వసూలు చేసేందుకు జంట సర్కిళ్ల అధికారులు సిద్ధమయ్యారు.

సర్కిళ్ల వారీగా..

కుత్బుల్లాపూర్ పరిధిలో 2024లో రూ.51 కోట్లు వసూలయ్యాయి. తాజాగా 2025లో టార్గెట్ రూ. 54 కోట్లు విధించారు. వ్యాపార వాణిజ్య గృహ సముదాయాలు 43, 987 ఉండగా ఇందులో 21 వేల మందికి రెడ్ నోటీసులు జారీ చేసి పన్నులు వసూలు చేస్తున్నారు.గాజులరామారం సర్కిల్ పరిధిలో 2024లో రూ.32 కోట్లు వసూలయ్యాయి. 2025లో రూ.35 కోట్లు టార్గెట్ విధించారు. 34 వేలకు పైగా వ్యాపార వాణిజ్య గృహ సముదాయాలు ఉండగా ఇక్కడ 5 వేల మందికి రెడ్ నోటీసులు జారీ చేశారు.

మొండి బకాయిదారులపై కొరడా..

జంట సర్కిళ్ల పరిధిలో రెడ్ నోటీసులు జారీ చేసినా పట్టించుకోని వ్యాపారులపై సర్కిల్ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. సుభాష్ నగర్ పైపులైన్ రోడ్డులో ఓ వ్యక్తి ఐదు లక్షల పైగా బకాయి ఉండగా ఉప కమిషనర్ నరసింహ ఆధ్వర్యంలో సదరు వ్యాపార కేంద్రం సీజ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే డబ్బులు కట్టడం విశేషం. అదేవిధంగా గాజులరామారం సర్కిల్ పరిధిలో ఓ వ్యక్తి మూడున్నర లక్షలు చెల్లించాలి ఉండగా సదరు వ్యక్తికి రెడ్ నోటీసు జారీ చేశారు. పట్టించుకోకపోవడంతో షట్టర్‌కు తాళం వేశారు. ఇలా దూకుడు పెంచుతూ మార్చి 31 వరకు అనుకున్న టార్గెట్ పూర్తి చేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.

కుంగిన డ్రెయిన్ నాలా మూత



ఐడీపీఎల్ చౌరస్తాలో..

రంగారెడ్డినగర్: అధికారుల నిర్లక్ష్యం వాహనదారులకు ప్రాణ సంకటంగా మారుతోంది. వర్షాకాలంలో వరదనీరు సాఫీగా వెళ్లేందుకు జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో పలు చౌరస్తాల్లో డ్రెయిన్ నాలాలను ఏర్పాటు చేసి వాటిపై ఐరన్ జాలీలను ఏర్పాటు చేశారు. భారీ వాహనాలు వెళ్లే క్రమంలో పలుచోట్ల అవి కృంగి పోయాయి. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి ఐడీపీఎల్ చౌరస్తాలో జగద్గిరిగుట్ట వైపు వెళ్లే ఫ్రీ లెఫ్ట్‌లో ఏర్పాటు చేసిన డ్రెయిన్ నాలా ఐరన్ జాలి దిగువకు కుంగింది. ఇటుగా జగద్గిరిగుట్టకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులతో పాటు వివిధ జిల్లాలకు వెళ్లే బస్సులు, గాంధీనగర్ పారిశ్రామికవాడకు లోడ్లతో వెళ్లే భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. నాలా మూత మరింత కుంగిపోయే ఆస్కారముంది. ద్విచక్ర వాహనదారులు అందులో ఇరుక్కుని గాయాల బారిన పడే ప్రమాదం పొంచి ఉంది. ప్రమాదాలు చోటు చేసుకోకముందే అధికారులు మేల్కొని డ్రెయిన్ నాలా జాలీని సరి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

వాటర్ ట్యాంకర్ పల్టీ.. డ్రైవర్ మృతి



సుభాష్‌నగర్: వాటర్ ట్యాంకర్ అదుపుతప్పి పల్టీ కొట్టడంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా పంపరావుపల్లి గ్రామానికి చెందిన ఈశ్వర్ (39) బతుకు దెరువు నిమిత్తం సంవత్సరం క్రితం ఎల్లమ్మ బండకు వచ్చి నివాసం ఉంటున్నాడు. గాజులరామారం పరిసర ప్రాంతాల్లో ప్రైవేట్‌గా వాటర్ ట్యాంకర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో గాజులరామారం నుంచి కైసర్ నగర్ వెళ్తున్న క్రమంలో దేవేందర్‌నగర్ రోడ్డు పక్కన ఉన్న గోడను ఢీ కొట్టడంతో ట్యాంకర్ పల్టీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన ఈశ్వర్ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ మేరకు సూరారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య ఉంది.

ఘనంగా వైఎస్ఆర్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి బాలాజీనగర్‌లో వైఎస్ఆర్‌సీపీ 15వ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఐస్‌క్రీమ్ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పార్టీ అధికార ప్రతినిధులు శ్యామల, కారుమూరు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం కేక్ కట్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వైఎస్ఆర్‌సీపీ మొదటి నుంచి సింగిల్‌గానే పోటీ చేసిందన్నారు. అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి గెలిచే వ్యక్తిత్వం జగన్‌మోహన్ రెడ్డిది కాదన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అధికార ప్రతినిధులు శ్యామల, వెంకటరెడ్డి తదితరులు

ఓ వైపు నీటి కటకట..మరో వైపు వృథా..



రోడ్డుపై పారుతున్న నీరు



పైపు నుంచి వృథాగా పోతున్న నీరు


దుండిగల్: ప్రతి నీటి చుక్క విలువైనది. విలువైన నీటిని వృథా చేయొద్దు. నీటిని ఆదా చేయాలని అధికారులు ప్రకటనలు గుప్పిస్తున్నారు. అసలే వేసవి కాలం.. పైగా తీవ్రంగా నెలకొన్న నీటి కొరతా.. ఒక వైపు గుక్కెడు నీరు దొరక్క ప్రజలు అల్లాడుతున్నారు. కానీ మరో వైపు బాధ్యత గల అధికారులు, సిబ్బందే నీటిని వృథా చేస్తున్నారు. దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట వార్డు కార్యాలయంలోని నీటి ట్యాంక్ నిండి కింద ఉన్న పైపు నుంచి ఉదయం 10 గంటల నుంచి సుమారు గంటన్నర పాటు నీరు వృథాగా పోయింది. కనీసం అధికారులు, సిబ్బంది పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రజలకు అవగాహన కల్పించడం కంటే ముందు నీటి ఆదాపై అధికారులకు, సిబ్బందికి అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.



మల్లంపేట వార్డు కార్యాలయం నుంచి..

'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- 47,432 మంది విద్యార్థులకు 230 పరీక్షా కేంద్రాలు
- ప్రతి కేంద్రంలోనూ సీసీ కెమెరాలు
- 3,200 మంది ఇన్విజిలేటర్లు.. 15 మంది ఫ్లయింగ్ స్క్వాడ్‌లు
- పరీక్షల నిర్వహణకు 567 మంది సీఎస్‌లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు



సాక్షి,సిటీబ్యూరో: పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. ఈ నెల 21 నుంచి వచ్చే నెల 4 వరకు జరగనున్న పరీక్షల్లో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటోంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 15 మండలాల పరిధిలో పరీక్షల నిర్వహణకు 230 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది 47,322 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరు కాకుండా మరో 609 మంది ప్రైవేట్ విద్యార్థులు కూడా పరీక్ష రాస్తున్నారు. మండలాల్లోని పరీక్ష కేంద్రాలను పరిశీలించే బాధ్యత ఎంఈవోలకు విద్యాశాఖ అప్పగించింది. ప్రహరీ, తాగునీరు, మూత్రశాలలు, వెలుతురు, విద్యుత్ సౌకర్యం తదితర అంశాలపై ఎంఈవోలు తనిఖీలు నిర్వహించి డీఈవోకు నివేదిక పంపిస్తున్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు సరిపడా ఫ్యాన్లు. మరుగుదొడ్లు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. పరీక్షా కేంద్రాల్లో 20 మంది విద్యార్థులకు ఒకరు చొప్పున 3,200 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. అలాగే 567 మంది చీఫ్ సూపరింటెంట్లు (సీఎస్),డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లను నియమించారు. 230 పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. సెంటర్ల వద్ద మెడికల్ టీమ్ ఏర్పాటు చేస్తున్నారు. మేడ్చల్ జిల్లాను ఎనిమిది రూట్లుగా విభజించి.. ఎనిమిది మంది రూట్ ఆఫీసర్లను నియమించారు. పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా 15 మంది ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించటంతోపాటు కేంద్రాల సంఖ్యకు అనుగుణంగా సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. ప్రశ్నపత్రాలను ప్రతిరోజూ సీసీ కెమెరాల నిఘాలో ఉంచనున్నారు. ఇందుకుగానూ అవసరమైన చర్యలు చేపట్టారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం:

పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణ అమలు చేసింది. మూడు నెలల ముందు నుంచే ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేకంగా అదనపు తరగతుల నిర్వహణతో పాటు సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధను కనబరిచింది. ఇంటి వద్ద విద్యార్థులు చదువుకునేలా ఉదయం ,సాయంత్రం వేళల్లో వారిని మానిటరింగ్ చేసేందుకు ప్రత్యేకంగా ఉపాధ్యాయులను నియమించారు.

విద్యార్థులకు ఇబ్బంది కలుగనివ్వం



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పరీక్షా కేంద్రాల గుర్తింపు, సిబ్బంది ఏర్పాట్లు పూర్తయ్యాయి. కేంద్రాల వద్ద ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాం. పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. - ఐ.విజయకుమారి, విద్యాశాఖ అధికారి ,మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా.